జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 28-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 657 పేజీలు: 4 వెల : రూ.7

# చికెన్.. మాఫియా! సిండికేట్







✳ ఆదివారం ఒక్కరోజే సామాన్యుడి జేబుకు రూ.40లక్షల చిల్లు ✳ జిల్లా అసోసియేషన్ ముసుగులో భారీ దోపిడీ ✳ పక్క జిల్లాకు, మనకు మధ్య కిలోకు రూ.40 వ్యత్యాసం ✳ వెంకటేష్ సూత్రధారి.. బాలరాజు రింగ్ మాస్టర్.. భాషా మాయాజాలం! ✳ కొందరు అధికారులకు 'మంత్లీ'లు కాదు.. 'వీక్లీ'ల దందా! ✳ రాష్ట్రం మొత్తం గగ్గోలు పెడుతున్నా జిల్లాలో 'శీను' మారడం లేదు ✳ గత ఆదివారం స్కిన్ లెస్ ధర రూ.295, ఈవారం ధర రూ.255 ✳ లైవ్ ధర రాష్ట్రం మొత్తం కిలోకు రూ.20 తగ్గినా జిల్లాలో మాత్రం మార్పు లేని వైనం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (వార్త):** జిల్లాలో చికెన్ ధరల వెనుక ఒక అదృశ్య హస్తం పనిచేస్తోంది. సామాన్య వినియోగదారుడు ఆదివారం వచ్చిందంటే చికెన్ సెంటర్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. దీనికి కారణం గిరాకీ పెరగడం కాదు.. జిల్లాలోని కొందరు బడా వ్యాపారులు 'సిండికేట్'గా ఏర్పడి ఆడుతున్న మాయాజాలం. శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ పేరుతో నడుస్తున్న ఈ ముఠా, పేదవాడి కడుపు కొట్టి కాసుల కుప్పలు పోసుకుంటోంది.

## 8కిలోమీటర్ల దూరానికే రూ. 40 తేడానా?

శ్రీకాకుళం జిల్లా సరిహద్దులో ఉన్న పైడిభీమవరం, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మధ్య దూరం కేవలం 8 కిలోమీటర్లే. కానీ, చికెన్ ధర చూస్తే అగాధమంత వ్యత్యాసం కనిపిస్తోంది. పూసపాటిరేగలో (విజయనగరం జిల్లా) స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 220 ఉంటే, సరిగ్గా 8 కిలోమీటర్ల అవతల ఉన్న మన జిల్లాలో అది రూ. 255 నుండి రూ. 260 వరకు పలుకుతోంది. గత వారమైతే ఇది ఏకంగా రూ. 295 కు చేరింది. అంటే పక్క జిల్లా కంటే ఇక్కడ కిలోకు రూ. 40 అదనంగా వసూలు చేస్తున్నారు.

## ఒక్క రోజు దోపిడీ.. రూ. 40 లక్షలు!

ఈ సిండికేట్ వేస్తున్న లెక్కలు వింటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే సుమారు లక్ష కిలోలకు పైగాలి చికెన్ విక్రయాలు జరుగుతాయని అంచనా. పక్క జిల్లా ధరతో పోలిస్తే మనం అదనంగా చెల్లిస్తున్న రూ.40ను లెక్కిస్తే.. కేవలం ఒక్క ఆదివారమే ఈ ముఠా సామాన్యుల నుంచి రూ. 40 లక్షలు కొల్లగొడుతోంది. నెలలో నాలుగు ఆదివారాలు లెక్కేస్తే ఈ దోపిడీ కోటిన్నర రూపాయలు దాటుతోంది. ఇదంతా కేవలం సిండికేట్ సభ్యుల జేబుల్లోకి వెళ్తున్న అదనపు లాభమే!

## వీళ్లే ఆ కీలక సూత్రధారులు!

ఈ మాయాజాలం వెనుక ఉన్న వ్యక్తుల పేర్లు ఇప్పుడు బహిరంగ రహస్యమే. వెంకటేశ్వరరావు అలియాస్ వెంకటేష్ ఈ సిండికేట్ మొత్తానికి కీలక సూత్రధారి. ధరల నిర్ణయం నుండి జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ నిర్వహణ వరకు అంతా ఈయన కనుసన్నల్లోనే జరుగుతుంది. రింగ్ మాస్టర్ బాలరాజు పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉంటూ, నగరం నడిబొడ్డున ధరలను శాసిస్తున్న వ్యక్తి. ఈయన చెప్పిందే అక్కడ వేదం. పెద్ద మార్కెట్ భాషా పాత నగరంలోని పెద్ద మార్కెట్‌లో ఉంటూ ధరల మాయాజాలాన్ని నడిపిస్తున్న మరో కీలక వ్యక్తి. వీరంతా 'అసోసియేషన్' పేరుతో చిన్న వ్యాపారులను సైతం తమ దారిలోకి తెచ్చుకుని, ఎవరైనా ధర తగ్గించి అమ్మాలని చూస్తే వారిని అడ్డుకుంటున్నారు. ధరలు ఇంత దారుణంగా ఉన్నా సంబంధిత శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద కథే ఉంది. సాధారణంగా కొన్ని విభాగాల్లో 'మంత్లీ'లు (నెలవారీ మామూళ్లు) అందుతాయని వింటుంటాం. కానీ, ఈ చికెన్ సిండికేట్ ఏకంగా 'వీక్లీ'లు (వారపు మామూళ్లు) అందజేస్తోందని సమాచారం. అందుకే పత్రికల్లో వచ్చే రేట్లు కేవలం అంకెలకే పరిమితం అవుతున్నాయి. ధర తగ్గినా అది వినియోగదారుడికి చేరడం లేదు, పెరిగితే మాత్రం భారం తక్షణమే అమలవుతోంది.

## మాకు అంతా తెలుసు.. తగ్గేదే లేదు!

ఈ సిండికేట్ సభ్యుల ధీమా చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. సామాన్యులు లేదా చిన్న వ్యాపారులు ఎవరైనా ప్రశ్నిస్తే.. "మాకు అందరూ తెలుసు, ఎవరిని ఎలా మేనేజ్ చేయాలో మాకు తెలుసు" తగ్గేదే లేదు..అంటూ కటువుగా సమాధానం ఇస్తున్నారు. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వీరికి కొండంత అండగా మారింది. శ్రీకాకుళం జిల్లాలో ఈ 'చికెన్ అరాచకానికి' చరమగీతం పాడేది ఎవరు? జిల్లాకలెక్టర్ స్పందించి, పొరుగు జిల్లాల ధరలను ప్రామాణికంగా తీసుకుని ఇక్కడ రేట్లను నియంత్రించకపోతే, సామాన్యుడి ఆదివారం విందు భారంగానే మిగిలిపోతుంది. విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి ఈ 'వెంకటేష్-బాలరాజు-భాషా' త్రయం ఆడుతున్న ధరల జూదానికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



### నేడు గో గ్రీన్ మందస ఆధ్వర్యంలో
## మొక్కలకు ట్రీగార్డుల ఏర్పాటు

**మందస, ఏప్రిల్ 27(వార్త):** గో గ్రీన్ మందస ఆధ్వర్యంలో మందసలో ని మొక్కలకు ట్రీగార్డులను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28(ఆదివారం)న కాశీబుగ్గ రేంజ్ అధికారి మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో సాయంకాలం 4గంటలకు బజారు జంక్షన్ వద్ద గోగ్రీన్ ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు ఇనుప రక్షణ గార్డులను ఏర్పాటు చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఆయన మొదటి రక్షణ గార్డును ఏర్పాటు చేసి కార్యక్రమం ప్రారంభిస్తారని, గో గ్రీన్ సభ్యులందరూ తప్పనిసరిగా సాయంకాలం 4 గంటలకు బజార్ జంక్షన్ వద్దకు చేరుకోవాలని వారు కోరారు.

### ఆరు గ్రామాలకు
## ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి

**సోంపేట, ఏప్రిల్ 27(వార్త):** సోంపేట నుంచి ఇసుకలపాలెం, కుత్తుమ, కొక్కిలిపుట్టుగ, అమ్మవారిపుట్టుగ, మండపల్లి, రుషికుద్ద తదితర గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం వెంటనే కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నేత వేదవర బిసాయి పలాస డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే స్పందించి ప్రతిరోజు ఆర్టీసీ బస్సు ఆయా గ్రామాల మీదుగా నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రతి నీటిబొట్టును రక్షిస్తేనే మనుగడ

**-31వ వార్డ్ టీడీపీ ఇన్‌చార్జి కురికన శంకరరావు**



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** ప్రతి నీటి బొట్టును మనం రక్షించుకుంటే, అది మన జీవితానికి, సమాజానికి, భవిష్యత్ తరాలకు కూడా రక్షణవుతుందని 31వ వార్డ్ టీడీపీ ఇన్‌చార్జి కురికన శంకరరావు అన్నారు. నీటి కోసం 31వ వార్డుల ప్రజలు ఇక్కట్లు పడుతుంటే ట్యాంకర్‌తో ఆదివారం నీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు ప్రాణానికి, ఆరోగ్యానికి, వ్యవసాయానికి, పర్యావరణానికి పునాది అయితే, ఒక చుక్క వృథా కాకుండా జాగ్రత్త తీసుకుంటే పెద్ద పరివర్తన సాధ్యమన్నారు. వేసవిలో ప్రజల ఆగచాట్లు చూసి తన వంతు సహాయం చేసేందుకు ముందుకొచ్చానని చెప్పారు. వేసవికాలంలో ప్రతి నీటి బొట్టును రక్షించుకోవాలని, నీటిని వృథా చేయకుండా పట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవుడయ్యా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీదిరి ఇలాకాలో వైకాపాయె..!

**-పలాసలో వైకాపాకు షాక్**
**-మాజీ మంత్రి అప్పలరాజు సొంత గ్రామం దేవునల్తాడలో గట్టిదెబ్బ**
**-టీడీపీలో చేరిన 100మంది వైసీపీ కార్యకర్తలు**
**-కొత్తపేట నుంచి 200 మంది చేరిక**
**-కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే శిరీష**



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** పలాస నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట పంచాయతీకి చెందిన సుమారు 200 మంది, మాజీమంత్రి సీదిరి అప్పలరాజు సొంత గ్రామం దేవునల్తాడ నుంచి 100 వైకాపా కార్యకర్తలు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పలాసలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిరీష వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ లో చేరిన వారు మాట్లాడుతూ మాజీ మంత్రి అప్పలరాజుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో అప్పలరాజు తమ కులస్థుడనే ఉద్దేశంతో ఆయనకు అండగా నిలిచాం. కానీ ఆయన పదవిలో ఉన్నప్పుడు తమ కులానికి గానీ, తమ గ్రామాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చూసి ఆకర్షితులమయ్యామని, అందుకే ఆమె నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధమయ్యామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గోవిందు పాపారావు, పుచ్చ ఈశ్వరరావు, తులే అప్పోజి, గుంటు వాసు, గుంటు బాలకృష్ణ, పీత బాలరాజు, మహిళలు , యువకులు పాల్గొన్నారు.

# కష్టపడిన వారికే పదవులివ్వాలి

**-పలాస-కాశీబుగ్గ జనసేన నాయకుల డిమాండ్**



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** పలాస-కాశీబుగ్గ లోని శివరామ ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ జనసేన నాయకులు, వీరమహిళల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలో వెన్నంటి ఉండి, జెండా మోసిన కార్యకర్తలకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ టిక్కెట్లు కేటాయించాలనే ఏకైక నినాదంతో ఈ భేటీ నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. నిబద్ధత కలిగిన వారికే టిక్కెట్లు కేటాయించాలని, వార్డుల పునర్విభజన నేపథ్యంలో, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాడిన వారికే టిక్కెట్లు దక్కేలా అధిష్టానానికి విన్నవించాలని నిర్ణయించారు. కూటమి గెలుపే లక్ష్యమగా పొత్తులో భాగంలో జనసేన పోటీ చేసే వార్డులతో పాటు, మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీ అభ్యర్థులు పోటీ చేసే చోట కూడా జన సైనికులు పూర్తి స్థాయిలో సహకరించి, కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించాలని తీర్మానించారు. త్వరలోనే పార్టీ పెద్దలను కలిసి, కార్యకర్తల మనోభావాలను తెలియజేస్తూ తదుపరి భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ జనసేన నాయకులు నందిగాం ధర్మారావు, తుంగన దేవా, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు తమడ రాము, దీనా పాత్రో, శంకు శ్రీకాంత్, రమేష్, కేదార్, సర్వవరపు ప్రదీప్, బుడ్డ కిశోర్, సాయి, శివ, శ్రీను, గుంట కిరణ్, హేమ, వీర మహిళలు యదమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పైడిగాంకు మరమ్మతులు వెంటనే జరిపించండి

**- ఎమ్మెల్యే అశోక్‌కు నేతల వినతి**



**సోంపేట, ఏప్రిల్ 27(వార్త):** సోంపేట, కంచిలి మండలాలకు సంబంధించి వేలాది ఎకరాల భూములకు సాగునీరందించే పైడిగాం ప్రాజెక్టుకు వెంటనే మరమ్మతులు జరిపించాలని జ్యోతిరావు పూలే రాష్ట్ర బీసీ సంఘం ప్రతినిధులు సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పైడిగాం ప్రాజెక్టు వాస్తవ పరిస్థితులను వివరించారు. ప్రస్తుత వేసవిలో మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే ఖరీఫ్ పంటకు సాగునీరు చాలా కష్టంగా మారుతుందని రైతులు తీవ్రంగా నష్ట పోతారని వివరించారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టుకు అరకొర మరమ్మతుల తప్ప పటిష్టమైన పనులు చేపట్టలేదని ఆయనకు తెలిపారు. దీంతో అనేక చోట్ల సైఫూన్లు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి షట్టర్లు కూడా లేవన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టుకు పెద్దనాష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వంతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేయించి మరమ్మతులు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీన ఢిల్లీరావు, మరల జేజేరావు, కప్ప గోపీనాథ్, గార కృష్ణారావు, కాళ్ల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



# సముద్రపు నాచుతో మత్స్యకారులకు నూతన ఆదాయం

**-తయారీపై అవగాహన కల్పిస్తాం**
**-తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి**
**- ఆయనతో కలిసి తీరప్రాంతాన్ని పరిశీలించిన చెన్నై బృందం**



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** సముద్రపు నాచు తయారీతో మత్స్యకారులకు కొత్త ఆదాయ మార్గం లభిస్తుందని పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి తెలిపారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారుల ఆదాయాన్ని పెంచే దిశగా సముద్రపు నాచు (సీవీడ్) తయారీపై ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చెన్నైకి చెందిన పరిశోధకులు డాక్టర్ ఆదివిశ్వనాథ్, డాక్టర్ గౌతమ్, డి.రమణ వారి బృందం, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిపుణులు సముద్రపు నాచు సాగు, దాని పెంపకం, సేకరణ, మార్కెటింగ్ విధానాలపై మత్స్యకారులకు సమగ్ర అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే అవకాశాలు ఈ రంగంలో ఉన్నాయని వారు వివరించారు. సముద్రపు నాచు పెంపకానికి అనుకూలమైన ప్రదేశాలను గుర్తించారు. వాతావరణ పరిస్థితులు, నీటి నాణ్యత, తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులను పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు వెల్లడించింది. స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సముద్రపు నాచు తయారీ ద్వారా మత్స్యకారులకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించ డమే లక్ష్యమని తెలిపారు. త్వరలో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, అవసరమైన శిక్షణ, సబ్సిడీలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్ కొరత లేకుండా ..
## తక్షణ చర్యలు చేపట్టాలి

**- పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి**




**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** ప్రస్తుత పరిస్థితుల్లో పెట్రోల్ బంక్ యాజ మాన్యాలు పెట్రోలు, డీజిల్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో పెట్రోల్ డీజిల్ అయిపోయిందనే బూటకపు సమాచా రాలు ఎక్కువగా వస్తున్నాయని, అవి లేకుండా చూడాలని, అవసరమైన మేరకు పెట్రోలు డీజీలు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని వారికి తెలిపారు. లేనిపోని తప్పుడు సమాచారాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. సమావేశంలో పెట్రోల్ బంక్ యాజమాన్యాలు కేవీ గోపాల్, కేవీ రామకృష్ణ, కొంచాడ హరి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### లీలారాణి ఆధ్వర్యంలో ..
## మజ్జిగ పంపిణీ

**సోంపేట, ఏప్రిల్ 27 (వార్త):** సోంపేట ఎంపీపీ సతీమణి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మన లీలారాణి పట్టణంలోని గాంధీ మండపం కూడలిలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండలతో ప్రజలు దాహార్తి చెందుతున్న పరిస్థితుల్లో ఇటువంటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంచి స్పందన లభించింది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి యత్నించండి

**-జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి**

**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** వచ్చే నెల 9న జరగనున్న లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయాలని పలాస జూనియర్ సివిల్ జడ్జ్ యు.మాధురి న్యాయవాదులకు సూచించారు. సోమవారం ఆమె పలాస కోర్టు ఆవరణలో న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో సివిల్, క్రిమినల్, మనోవర్తి, భార్యాభర్తల, బ్యాంకు లోన్ రికవరీ కేసులు ఉన్నాయని, వాటి రాజీకి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు జి.ప్రభాకరరావు, టి.శ్యామ్ సుందరరావు, బ్యాంకు స్టాండింగ్ కౌన్సిల్స్ కె.రజినికుమార్, స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఏపీ గ్రామీణ బ్యాంక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# కూటమి హయాంలోనే పల్లెల అభివృద్ధి

**-టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి**

**-ఎన్నికలకు సైనికుల్లా సిద్ధం కండి**

**-టీడీపీ కార్యకర్తలకు పిలుపు**



**మందస, ఏప్రిల్ 27(వార్త):** కూటమి హయాంలోనే పల్లెల అభివృద్ధి జరుగుతోందని తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయ కర్త వై.వెంకన్నచౌదరి అన్నారు. సోమవారం ఆయన మందస మండలంలోని బసవసాయి, బొగాబంద, హంసరాళి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో గ్రామాలాభివృద్ధి జరిగిందన్నారు. రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సైనికుల్లా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించా మన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసిందన్నారు. సమస్యలను తెలుసుకొని, పరిష్కారం చూపడానికే ప్రజల వద్దకు నేరుగా వచ్చా నన్నారు. వాటిని ఎమ్మెల్యే దృష్టికి పెట్టి ఈ ప్రాంతాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని కచ్చితంగా అందిస్తానని తెలిపారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యంగా రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని నాయకులకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ప్రజలతో సన్నిహితంగా ఉండి ప్రభుత్వ పథకాలు, పార్టీ విధి విధానాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, సేవా దృక్పథం గల నాయకులను సూచించాలని కోరారు. ఎన్నికల సమ యంలో క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ ప్రతిష్టను నిలబెట్టాలని సూచించారు.

సమావేశంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలిన మాధవరావు, దాసరి తాతారావు, చంద్రశేఖర్ ముంజేటి, భాస్కరరావు తమరియా, డుంకూర తిరుపతి, లింగరాజు రట్టి, ధనుంజయ తమ్మినేని, మంగళ పాత్రో, మండల లచ్చయ్య, అగ్గున ఈశ్వర్ రావు, హరీష్ గోర్లే, ప్రశాంత్ సవర, అడ్డి దండాసి, గుంట నారాయణ, పులారి సిద్దు, తారక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి వైఫల్యంతోనే ఇంధన వనరుల కొరత

**-నాడు వంటగ్యాస్, నేడు పెట్రోల్, డీజిల్ కొరతతో ప్రజలకు ఇబ్బందులు**

**- వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** రాష్ట్రంలో నాలుగు రోజులుగా పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన వనరులు దొరక్క, బంకుల వద్ద ప్రజలు క్యూ కడుతున్నా రని, సరుకుల రవాణా నిలిచిపోయిందని, 45 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు మాత్రం దీనిపై స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే ఇంధన వనరుల కొరత ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితికి పూర్తిగా చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం, అనాలోచిత విధానాలే కారణమ న్నారు. ఇంధన సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగా సాధా రణ ప్రజలు, ఉద్యోగులు, రైతులు, రవాణా రంగానికి చెందినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే లోకేష్ కనిపించడం లేదన్నారు. చంద్రబాబు చేతులు ఎత్తేశారని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు తక్షణం మేల్కొని సొరకాయ కోతలు మాటలు ఆపి.. ప్రధాని మోదీతో మాట్లాడి ఈ ఇబ్బందుల నుంచి ప్రజలను గట్టెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదని, అప్పట్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి సమయం లో కూడా వైయస్ జగన్ ధైర్యంగా, సమర్థవంతంగా పరిస్థితిని ఎదుర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పెట్రోల్, డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని, ప్రజ లకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## ఉప రాష్ట్రపతితో దాసునాయుడు మర్యాదపూర్వక భేటీ



**నరసన్నపేట, ఏప్రిల్ 27(వార్త):** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆహ్వానం మేరకు భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకూర్మంలో కూర్మానాథ స్వామి ఆలయాన్ని, అనంతరం అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక సందర్శనల అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసంలో ఉప రాష్ట్రపతిని శ్రీకాకుళం జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో ఆయన కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## మందస రైల్వేస్టేషన్‌లో పండగ వాతావరణం

**-అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు సత్కారం**

**-మరికొన్ని సమస్యలు పరిష్కరించాలని వినతి**




**మందస, ఏప్రిల్ 27(వార్త):** మందస రైల్వే స్టేషన్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా సమస్యలపై స్థానికులు పోరాడుతుండగా.. వాటిలో కొన్ని పరిష్కారమయ్యాయి. దీంతో స్టేషన్ అభివృద్ధి కమిటీ నాయకుల ఆధ్వ ర్యంలో మందస రైల్వేస్టేషన్‌లో ఆనందోత్సవాలను జరిపారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి పలాస రైల్వే స్టేషన్ వరకు విశాఖ జోన్‌లో కలిపినందుకు, బరంపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు మందస రోడ్‌లో హాల్టిచ్చినందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ మాస్టర్‌తో కేక్ కట్ చేసి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష, అధికారులు, రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాసరౌలోకు ధన్యవాదాలు తెలిపారు. మందస రైల్వేస్టేషన్‌లో గుణుపూరు-కటక్ ప్యాసింజర్, భువనేశ్వర-సికింద్రాబాద్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని వారు కోరారు. తిరుపతి-శ్రీకాకుళం హంసఫర్ రైలును పలాస వరకు పొడిగిస్తూ పలాస. సికింద్రాబాద్‌కు రోజూ వారీ రైలును వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ హరిగోపాల్, అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్ర రామారావు, కొత్ర ఆనందరావు, రౌతు చిరంజీవిరావు, మాజీ ఎంపీటీసీ బైరిశెట్టి గున్నయ్య, గొలుసు చంద్రశేఖరం, కాసులదేవు మహేష్, మండెల్లి జోగారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఈదుపురంలో కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 27 (వార్త):** ఈదుపురంలో బొడ్డు లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎయిమ్ ఫర్ సేవా విభాగం కింద మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన రెండో బ్యాచ్ ప్రారం భోత్సవంలో ముఖ్య అతిథి, వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ఈదుపురంలో ప్రత్యా మ్నాయ ఉపాధి కల్పనకు బొడ్డు లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీ యమన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ చార్టెడ్ అకౌంటెంట్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ శిక్షణతో గ్రామీణ ప్రాంతాల్లో వస్త్రాల తయారీ యూనిట్ లు స్థాపించడానికి ముందుకు వస్తారని చెప్పారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు బాగ జయపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బొడ్డు జగదీశ్వర రావు, డైరెక్టర్ వల్లభరావు, కపాసుకుద్ది మాజీ సర్పంచ్ కాయ బీమాసేన్, ఉపాధ్యాయులు నర్తు గంగయ్య, ఇన్నయ్య, ఆశి పురుషోత్తం, ఈదుపురం హైస్కూల్ చైర్మన్ శీరపు నరసింహామూర్తి, షిరిడీసాయి మందిరం ధర్మకర్త ఉలాసి గోపాల్‌రెడ్డి, రాయపూడి దేవరాజు, బోర చిన్నారావు, టైలరింగ్ మాస్టర్స్, ట్రైనీ టైలర్స్, మహిళలు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించిన.. ఎమ్మెల్యే రవికుమార్, గజల్ శ్రీనివాస్



**జలుమూరు, ఏప్రిల్ 27(వార్త):** శ్రీముఖలింగంలో కొలువైన శ్రీ ముఖ లింగేశ్వర స్వామిని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకలశంతో సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ ఆలయ విశిష్టతను ఈఓ కొండలరావు, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ క్షేత్రం కాశీ, కేదార్నాథ్ ఆలయాలను తలపిస్తుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, వంశధార నది తీరంలో ఉన్న ఈ ప్రాచీన శైవక్షేత్రాన్ని అభివృద్ధి పరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ కుంభాభిషేకాన్ని త్వరలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ చరిత్ర, అభివృద్ధి అవసరాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, ఆలయ చైర్మన్ శివప్రసాద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ వెంకటాద్రి నాయుడు గుంటూరు మండలంలోని ధరణికోట వద్ద అమరావతి పట్టణాన్ని నిర్మించిన మహనీయుడని తెలిపారు. ఆయన నిర్మించిన ఈ నగరాన్ని ఆసియాటిక్ జర్నల్‌లో కొలిన్ మెకంజీ ప్రశంసించినట్లు వివరించారు. ఆయన ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, రాజనీతిజ్ఞత, వీరత్వం, ధాతృత్వం, భక్తి వంటి విశిష్ట గుణాలు సమాహారంగా నిలిచాయని పేర్కొంటూ, విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఆయన నిర్మించిన దేవాలయాలు, ప్రసాదించిన అగ్రహారాలు ఆయన కీర్తికి చిరస్థాయి చిహ్నాలుగా నిలిచాయని తెలిపారు.



### మజ్జిగ పంపిణీ

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పలాస గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి పైగా క్షతగాత్రులు, బాటసారులు, వృద్ధులకు మజ్జిగ పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చల్లని మజ్జిగతో దాహం తీర్చడం అనేది హృదయాలను గెలుచుకునే సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన హిందీ లెక్చరర్ డాక్టర్ వై.వెంకటలక్ష్మిని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమాల్లో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి. నరసింహు లు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు, తదితర అధా ్యపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

### -ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి

**పోలాకి, ఏప్రిల్ 27 (వార్త):** పోలాకి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను 'యూడైస్ ప్లస్' పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మండల ఎంఈవో-2 ఎస్. శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎంఆర్సీ కార్యాలయంలో సీఆర్ఎంటి సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన, విద్యార్థుల సమాచారం సక్రమంగా నమోదు చేయడం ద్వారా విద్యా వ్యవస్థలో పారదర్శకత, ప్రణాళికాబద్ధత పెరుగుతాయని తెలిపారు. మండలంలో అంగన్వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి 152 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశం పొందినట్లు ఆయన వెల్లడించారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సమయానికి వివరాలు నమోదు చేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈవో సూచించారు.



# ఎరువుల వ్యాపారస్తుల బంద్ విజయవంతం

### -రవాణా చార్జీలు కంపెనీలే భరించాలని డిమాండ్

**నరసన్నపేట, ఏప్రిల్ 27(వార్త):** రాష్ట్రవ్యాప్తంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వర్తకులు చేపట్టిన బంద్ విజయవంతమైందని నాయకులు ఉన్న కళ్యాణ్ కుమార్ (అనిల్), శ్రీధర్, కామేశ్వరరావు తెలిపారు. సోమవారం నరసన్నపేట మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలు మూసివేసి వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరా సమయంలో కంపెనీలు ప్రతి బస్తాకు అదనపు ఉత్పత్తులు (నానో యూరియా, జింక్, గ్రోత్ ప్రమోటర్లు తదితరాలు) లింక్ చేసి ఇవ్వడం వల్ల రైతులపై అదనపు భారం పడుతోందని వారు ఆరోపించారు. ఈ లింక్ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోతే ఎరువులు ఇవ్వడం లేదని, దీనివల్ల రైతులు, వర్తకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువుల కొనుగోలులో రవాణా చార్జీలు కంపెనీలు భరించాల్సి ఉండగా, ప్రస్తుతం డీలర్లు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని, అయితే రైతులకు మాత్రం ఎమ్మార్పీకి మించి విక్రయించలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. ఈ పరిస్థితుల్లో డీలర్లు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని, రైతులకు న్యాయమైన ధరలకు ఎరువులు అందించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే స్పందించి ఎరువుల కంపెనీ యాజమాన్యాలతో చర్చలు జరిపి, రవాణా చార్జీలు (ఎఫ్.ఓ.ఎల్) కంపెనీలే భరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎరువుల సంఘం పిలుపుమేరకు బంద్ నిర్వహించామని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎరువుల దుకాణాల సంఘం అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కామేశ్వరరావు తెలిపారు.




## ఇంధన కొరతపై వైసీపీ నాయకుల నిరసన



**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొన్నదని, దీనిని ఎదుర్కోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీపీ ఆరంగి మురళీధర్ ఆరోపించారు. సోమవారం నరసన్నపేటలోని స్థానిక పెట్రోల్ బంకు వద్ద వైసీపీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్‌తో పాటు ఎరువులు, గ్యాస్ కొరతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రోజువారీ అవసరాల సరఫరాలో లోపాలు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంధన సరఫరా సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వనరులను అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోమనాపల్లి రహదారిపై మురుగునీరు



**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** కోమనాపల్లి గ్రామ ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గృహాల నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపైనే చేరి కుంటలా మారింది. బడ్రి -- సరుబుజ్జిలి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ఈ సమస్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. స్థానికులు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలను నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా వెంకటాద్రి నాయుడు జయంతి




**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమవారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ మాట్లాడుతూ, అమరావతిని రాజధానిగా చేసుకుని సుమారు వందేళ్లపాటు వెంకటాద్రి నాయుడు వంశం పరిపాలన సాగించిందని తెలిపారు. ఆయన పాలనలో ప్రాంతీయ అభివృద్ధికి చేసిన కృషిని స్మరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

## నరసన్నపేటలో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ

### -కొరతపై వాహనదారుల్లో ఆందోళన



**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** నరసన్నపేట మండలంలో పెట్రోల్ బంకులు వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లుగా వస్తున్న వార్తల నేపథ్యంలో వాహనదారులు ముందస్తుగా తమ వాహనాల్లో ఇంధనం నింపుకునేందుకు బంకులకు తరలివస్తున్నారు. అయితే ప్రస్తుతం పెట్రోల్ కొరత లేదని బంకు నిర్వాహకులు స్పష్టం చేస్తున్నప్పటికీ, పరిస్థితులు మారే అవకాశం ఉందనే ఆందోళన వాహనదారుల్లో కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, కొంతమంది బంకుల్లో ద్విచక్ర వాహనాలకు రూ.200 వరకు మాత్రమే ఇంధనం నింపుతున్నారని వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ప్రజల్లో మరింత అనుమానాలు, ఆందోళన పెరుగుతోంది. పెట్రోల్ సరఫరా విషయంలో స్పష్టత లేకపోవడం, పరిమితంగా ఇంధనం ఇవ్వడం వంటి అంశాలు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితిపై అధికారులు స్పందించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కోమర్తిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** కోమర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో ఇళ్లకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన ఉపాధ్యాయులు, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో దాలినాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో తల్లిదండ్రులు, గ్రామస్థులు సహకరించాలని కోరారు. ప్రతి విద్యార్థి విద్యను పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఉప రాష్ట్రపతిని కలిసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**నరసన్నపేట, ఏప్రిల్ 27 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వగృహంలో జరిగిన ఈ భేటీలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నరసన్నపేట నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణ, తాగునీరు, రహదారులు, విద్యా మరియు వైద్య సదుపాయాల మెరుగుదలపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని ప్రాజెక్టులను తీసుకురావాల్సిన అవసరాన్ని ఉప రాష్ట్రపతికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, "మా నియోజకవర్గ ప్రజల ఆశయాలను నెరవేర్చడం మా ప్రధాన లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తాము. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, రైతులకు మద్దతు అందించడం కోసం కృషి చేస్తాము" అని తెలిపారు. ఈ భేటీతో ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానిక నాయకులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీ కార్యకర్తలతో శ్యామ్ ముఖాముఖి




**సోంపేట, ఏప్రిల్ 27 (వార్త):** బారువలో వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ కన్వీనర్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి రాష్ట్ర వైసీపీ బీసీ భాగం కార్యదర్శి నత్తు నరేంద్ర యాదవ్ తో కలిసి సోమవారం పార్టీ కార్యకర్తలు నాయకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కమిటీలలో నెలకొన్న సందిగ్ధతపై స్పష్టతనిచ్చారు. పార్టీ వాస్తవ ఓటర్ లను పరిరక్షించుకోవడానికి పార్టీ పరంగా తీసుకోవలసిన చర్యలు గూర్చి చర్చించారు. పార్టీని మరింత సమర్థవంతంగా పటిష్ట పరచడానికి అందరి సహకారం కావాలని శ్యాం ప్రసాద్ కోరారు. పార్టీ శ్రేణులు ఉమ్మడిగా కదిలితే తెలుగుదేశం పార్టీని నిలువరించడం పెద్ద కష్టం కాదని అన్నారు. బారువాలో పొండిరేవు బ్రిడ్జి, మహేంద్ర తనయ బ్రిడ్జి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వంటి నిర్మాణాలు వైసీపీ ప్రభుత్వం క్రెడిట్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సల్ల దేవరాజు తడక జోగారావు గుర్రాల శ్రీను తామడ విశ్వనాథం భువనేశ్వర్ పాణిగ్రాహి తిరుపతిరెడ్డి మాధవరావు ధర్మారావు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితురాలికి సహాయం:

గత నెలలో సిందిరి దేవి అనే మహిళకు చెందిన పిండి మిల్లు అగ్నికి ఆహుతి కావడంతో ఆమెకు శ్యాం ప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా ఎనిమిది వేల రూపాయల సహాయాన్ని అందజేశారు. పార్టీ శ్రేణులు ఆమెకు సహకరించాలని కోరారు.

## పీడిత ప్రజల పక్షపాతి కామ్రేడ్ భీమారావు

**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** పీడిత ప్రజల పక్షపాతి, ప్రజాపోరాటాలలో అలుపెరుగని కామ్రేడ్ రెయ్యి భీమారావు అని దేశ భక్త ప్రజాఉద్యమ జిల్లా కమిటీ నాయకులు సాలిన వీరాస్వామి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పుచ్చ దుర్యోధనరావు అన్నారు. బొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరం ఆవరణలో సోమవారం భీమారావు వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగదా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పత్తిరి దానేసు, జోగి కోదండరావు, తామాడ త్రిలో చనరావు, పాపయ్య, గంగయ్య మాట్లాడుతూ భీమన్న వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన వ్యక్తి అని తెలి పారు. తన చుట్టూ ఉన్న గ్రామస్థుల్లో చైతన్యం తెచ్చేవారన్నారు. ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. క్రియాశీలకంగా పాల్గొని జిల్లా కమిటీ నాయకత్వంతో పాటు అనేక బాధ్యతలను స్వీకరించి వాటిని ఆచరణలో అమలు చేశారని కొనియాడారు. రాష్ట్ర కమిటీ సభ్యునిగా, జిల్లా కమిటీ అధ్యక్షునిగా బరు వైన బాధ్యతలను చేపట్టి అమలు చేశారన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమం లో ఉద్దానం ప్రాంతానికి చెందిన ఉద్యమ అభి మానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వానికి ..
# దువ్వాడ ఆరు ప్రశ్నలు



**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వానికి పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) సూటిగా ప్రశ్నలను సంధించారు. సోమవారం స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలాస జిల్లా ప్రకటించి చివరి క్షణంలో తప్పించడం అన్యాయమని, ఇప్పుడేమో సుదీర్ఘ ప్రక్రియ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారామీటర్ల గురించి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత 13 జిల్లాలను 28 జిల్లాలుగా విభజించినప్పుడు ఇవన్నీ ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. అప్పుడు అవసరం లేని ప్రక్రియ ఇప్పుడు ఎందుకు అవసరమైందని ?, ప్రజల అభిప్రాయాన్ని ఎందుకు పట్టించు కోవడం లేదని ?, ప్రకటించిన పలాస జిల్లాను ఎందుకు రద్దు చేశారని ?, 2024లో ప్రకటించిన 5 కొత్త జిల్లాల్లో ముందుగా పలాస జిల్లా ఉండగా, ఇప్పుడు ఎందుకు తొలగించారని, పలాస జిల్లా ఏర్పాటును ఎవరు అడ్డుకు న్నారో ప్రజలకు తెలుసునని తెలిపారు. పలాస ప్రజలు ఎదురుచూస్తున్న 6 ప్రధాన సమస్యలపై కేంద్ర పౌర విమానం శాఖ మంత్రి కింజరాపు రామ్మోహనాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముప్వల నగేష్ కుటుంబానికి న్యాయం ఎక్కడ?, 2024 ఎన్నికల సమయంలో పలాసలో జరిగిన బహిరంగ సభలో నారా లోకేష్ "100 రోజుల్లో న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికి 683 రోజులు గడిచినా, ఆ హామీ ఎక్కడుంది?, మద్యం అక్రమ విక్రయాలపైన, పలాస వైన్ షాపుల్లో బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే రూ.10 ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో రూ.40 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, పలాస మున్సిపాలిటీలో హౌస్ ట్యాక్స్ ప్రతి సంవత్సరం ఆటోమేటిక్‌గా 15% పెంపు రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో బీసీగా ఉన్న కేవీటీలను ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన బాధ్యత ఎంపీకి లేదా, కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టి చెయ్యాలి కదా అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణ లేకుండా పోయిందని, పలాసలో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, దేవాదాయ భూములను కంచె వేసి రక్షించాల్సిన బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై నేరుగా అడిగిన ప్రశ్నలపై అధికారంలో ఉన్నవారు సమాధా నం చెప్పాలని, స్పందించాల్సిందేనని, ఇది రాజకీయ అంశం కాదు ప్రజల గుండె చప్పుడని, ఈ ఆరు సమస్యలకు పరిష్కారం వచ్చే వరకు ప్రజల తరపున ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. పలాస సమస్యలపై తమ స్వరం వినిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వేసవి విద్యావారిధితో విద్యార్థులకు ఎంతో మేలు

### -ప్రధానోపాధ్యాయుడు కుత్తం ప్రకాశరావు

**మందస, ఏప్రిల్ 27(వార్త):** వేసవి విద్యావారిధితో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు కుత్తం ప్రకాశరావు అన్నారు. లొహరిబంద పంచాయతీ కొత్తపేట మోడల్ ప్రైమరీ స్కూల్ లో వేసవి శిక్షణా తరగతులను(వేసవి విద్యా వారధి) సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదు తరగతులుకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. తరగతిని బట్టి అభ్యసనా సామర్థ్యంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, సానబెడతామన్నారు. వేసవి విద్యా వారధికి సుమారు 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతీ విద్యార్థికి నోటు పుస్తకం, కలం, పెన్సిళ్లను అందించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో చదువుకోవాలనే భావన కలిగించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, తల్లిదండ్రులు వారిని పంపించాలని ఎస్ఎంసీ చైర్మన్ అడతాల సోమేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ వజీర్, సీహెచ్ సావిత్రి, అంగన్ వాడీ ఇనస్ట్రక్టర్ ధనలక్ష్మి, పెద్దింటి భీమారావు టీచర్ గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గూడ్స్ రైలులో పొగలు




**పలాస, ఏప్రిల్ 27 (వార్త):** విశాఖపట్నం వైపు బొగ్గుతో వెళుతున్న గూడ్స్ రైలులో పొగలు కనిపించడంతో పూండి రైల్వే స్టేషన్ వద్ద పూండి స్టేషన్ మాస్టర్ గమనించారు. వెంటనే రైలును నిలుపుదల చేయడంతో పాటు పలాస అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు, సిబ్బంది సమాచారం అందజేశారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలను ఆర్పివేసిన తర్వాత గూడ్స్ రైలును రైల్వే అధికారులు మళ్లీ విశాఖపట్నం వైపు పంపించారు. వేసవిలో ఎండలు మండుతుండడంతో బొగ్గు నుంచి పొగలు రావడంతో రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## ఆదిత్య, కూర్మనాధుని దర్శించుకున్న

# ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

* వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు
* ఆలయాల విశిష్టతను వివరించిన అర్చకులు
* స్వాగతం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు









**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (వార్త):** భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ శ్రీకాకుళం జిల్లా పర్యటన సోమవారం ఆధ్యాత్మికంగా, అత్యంత ఆత్మీయంగా సాగింది. జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని సందర్శిచారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణ నడుమ ఉపరాష్ట్రపతికి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. ముందుగా డచ్‌బంగ్లా హెలిప్యాడ్ వద్ద ఉపరాష్ట్రపతికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి మిల్లు జంక్షన్ మీదుగా కాన్వాయ్‌లో నేరుగా శ్రీకూర్మ క్షేత్రానికి చేరుకున్నారు. ఏకైక కూర్మ రూప క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను, తాబేళ్ల పార్క్ ను సందర్శించారు. ఆలయ శిల్ప సంపద పట్ల మంత్రముగ్ధులు అయ్యారు. అక్కడి నుండి అరసవల్లి సూర్య దేవాలయానికి ఉప రాష్ట్రపతి కాన్వాయ్ చేరుకుంది. ఉపరాష్ట్రపతికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు వేద మంత్రోచ్ఛారణల మధ్య తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఇంద్ర పుష్కరిణిలో జరుగుతున్న నూతన నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి దగ్గరుండి పరిశీలించారు. పర్యటనలో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడికుదుటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు తదితరులు ఉపరాష్ట్రపతిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ఆలయాల దర్శనం అనంతరం ఉపరాష్ట్రపతి నేరుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులను ఆయన పలకరించారు.


ఈ సందర్భంగా దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎర్రన్న సతీమణి విజయలక్ష్మిని, సోదరుడు కింజరాపు ప్రభాకరరావును ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సుమారు గంటన్నర పాటు గడిపిన ఆయన, అక్కడి నుండి నేరుగా హెలి ప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఉప రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పర్యటన అంతా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

### శ్రీకూర్మనాథ ఆలయ అభివృద్ధికి సహకరించండి

శ్రీకాకుళం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కూర్మనాథ క్షేత్రం అభివృద్ధికి సహకరించాలని ఉపరాష్ట్రపతి సి. పి రాధాకృష్ణకు ఎమ్మెల్యే గొండు శంకర్ వినతిపత్రం అందజేశారు. దేశంలోనే కూర్మ అవతారానికి అంకితమైన అరుదైన ఆలయంగా దీనికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, మౌలిక సదుపాయాల కొరత వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆలయ ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు, వసతి, పారిశుధ్యం, రవాణా వంటి సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం పరిధిలోకి చేర్చి, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ ఆలయానికి రాష్ట్రంతో పాటు పొరుగు ప్రాంతాల నుండి భారీగా భక్తులు వస్తున్నారన్నారు. అలాగే కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించి జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు.

### భద్రత కట్టుదిట్టం

ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ శ్రీకాకుళం జిల్లా పర్యటనను జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పూర్తి చేసింది. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, స్వీయ పర్యవేక్షణలో ముందస్తు ప్రణాళిక ప్రకారం సమగ్ర భద్రతా చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టితో కలిసి జిల్లా ఎస్పీ ముందస్తుగా హెలిప్యాడ్, రూట్ మార్గం, శ్రీకూర్మం, అరసవిల్లి ఆలయ ప్రాంగణం భద్రత, బందోబస్తు క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యటనకు సంబంధించి మార్గమంతా విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసి, ముఖ్య ప్రదేశాల్లో పటిష్ట నిఘాతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లను వినియోగించి ప్రతి ప్రాంతాన్ని ముందస్తుగా పరిశీలించి భద్రతను మరింత బలోపేతం చేశారు. ఆధునిక సాంకేతిక, కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా నిరంతర పర్యవేక్షించారు. ట్రాఫిక్ మళ్లింపులు, మార్గ నిర్దేశాలు ప్రజలకు ముందుగానే తెలియజేసి, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలు పోలీసుల సూచనలను పాటించడం వల్ల పర్యటన సజావుగా సాగడానికి సహకారం లభించిందని ఎస్పీ తెలిపారు.





## బంకుల్లో..

# నో స్టాక్ బోర్డులు

* పెట్రోల్ బంకులకు బారులు దీరిన వాహనచోదకులు
* పెట్రోల్, డీజిల్ కొరత అంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు
* ఫుల్‌ట్యాంకు చేసుకుంటున్నన్న వాహనదారులు
* పెట్రోల్, డీజిల్ కొరత లేదు
* ఆందోళన చెందనవసరం లేదు
* కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు
* ఇంధన సరఫరాలో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి
* కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
* ఇళ్ల వద్ద పెట్రోల్, డీజిల్ స్టాక్ ఉంచొద్దు
* పేలిపోయే ప్రమాదం
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (వార్త):** జిల్లాలోని పెట్రోల్ బంకులు.. వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లుగా వస్తున్న వార్తల నేపథ్యంలో వాహనదారులు ముందస్తుగా తమ వాహనాల్లో ఇంధనం నింపేందుకు బంకులకు తరలివస్తున్నారు. అయితే ప్రస్తుతం పెట్రోల్ కొరత లేదని బంకు నిర్వాహకులు స్పష్టం చేస్తున్నప్పటికీ, పరిస్థితులు మారే అవకాశం ఉందనే ఆందోళన వాహనదారుల్లో కనిపిస్తోంది. వాహనచోదకులు మాత్రం ముందస్తు జాగ్రత్త కింద ఫుల్‌ట్యాంకు చేసుకుంటున్నారు. అయితే జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం నాలుగు రోజులకు సరిపడా 713 కిలోలీటర్ల పెట్రోల్, 734 కిలో లీటర్ల డీజిల్ అందుబాటులో ఉన్నాయని ఇది మరో 4 రోజులకు పైగా సరిపోతుందన్నారు. ఇది కాకుండా ప్రతిరోజు ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలు నిరంతరం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం నుండి నిత్యం ట్యాంకర్లు వస్తూనే ఉన్నాయని, సోమవారం కూడా అదనంగా 230 కిలోలీటర్ల డీజిల్ జిల్లాకు చేరుకుందన్నారు. అపోహల కారణంగా సగటు విక్రయాల కంటే సోమవారం ఒక్కరోజే 165 కిలోలీటర్ల పెట్రోల్, 210 కిలోలీటర్ల డీజిల్ అదనంగా విక్రయించాల్సి వచ్చిందని, ఫలితంగా కొన్ని బంకుల్లో స్టాక్ అయిపోయినట్లు బోర్డులు వెలిశాయని పేర్కొన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా లేదా అక్రమ వ్యాపారానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, ఇంధన సరఫరాలో సమస్యలు ఉంటే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. అలాగే ప్రతి బంకు వద్ద ఒక పోలీస్, ఒక రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు. ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయి. నో స్టాక్' బోర్డు పెట్టిన బంకు యజమానులు, తిరిగి ఏ సమయానికి ఇంధనం అందుబాటులోకి వస్తుందో తప్పనిసరిగా బోర్డుపై ప్రదర్శించాలన్నారు. వ్యవసాయ, ఆక్వా, హార్టికల్చర్ రంగాల వారికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక కూపన్లపై ఇంధనాన్ని సరఫరా చేస్తారన్నారు. రైతులకు 50 లీటర్ల వరకు ఇబ్బంది లేకుండా ఇస్తామని, అయితే బల్క్ విక్రయాల పేరిట 300 లీటర్ల కంటే ఎక్కువ ఒకేసారి ఇచ్చే అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్‌ను ఇళ్లలో నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున అవి పేలుళ్లకు దారితీసి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఎవరైనా ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేస్తే వారి వివరాలని అందించాలని, సమాచారం ఇచ్చే వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండ్యా కూడా ఉన్నారు.




## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుకు నివాళి

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 27 (వార్త):** రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారి జయంతి సందర్భంగా సోమవారం పోలీసు కార్యాలయంలో కార్యాలయ పరిపాలన అధికారి సి.హెచ్. గోపినాథ్, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏవో గోపినాథ్ మాట్లాడుతూ, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 1761 ఏప్రిల్ 27న జగ్గా భూపతి, అచ్చమాంబ దంపతులకు జన్మించారని తెలిపారు. ఆయన అప్పటి అమరావతిని రాజధానిగా చేసుకొని కృష్ణా, గుంటూరు ప్రాంతాలను పరిపాలించిన జమీందారు, అమరావతి సంస్థాన పాలకుడిగా విశేష కీర్తి పొందారని పేర్కొన్నారు. కవి పండితులకు ఆశ్రయదాతగా, మంచి పరిపాలనాదక్షుడిగా పేరుపొందిన ఆయన కృష్ణా డెల్టా ప్రాంతంలో సుమారు 100కు పైగా దేవాలయాల నిర్మాణానికి కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సహాయ కలెక్టర్‌గా హరిఓం పాండియా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (వార్త):** జిల్లా సహాయ కలెక్టర్ (శిక్షణ)గా 2025 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హరిఓం పాండియా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన, అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాజస్థాన్‌లోని బికనీర్‌కు చెందిన హరిఓం పాండియా విద్యార్థి దశ నుంచే ప్రతిభ కనబరిచారు. బి.ఎ. ఎల్.ఎల్.బి పూర్తి చేసిన ఆయన, కేవలం 23 ఏళ్ల వయసులోనే తన తొలి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్ పరీక్షలో 160వ ర్యాంకు సాధించి ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించబడిన ఆయన, జిల్లా శిక్షణలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు విచ్చేశారు.

## వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

* జిల్లాలో 68 కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు * 8 నుండి 16 ఏళ్ల బాలబాలికలకు అవకాశం * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 (వార్త):** జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1వ తేదీ నుండి 31వ తేదీ ఉచితంగా నిర్వహిస్తున్నట్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 కేంద్రాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు 8 నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలు అర్హులన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుండి 8.00 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు శిక్షణలు ఉంటాయి. ఆసక్తి గల క్రీడాకారులు sport.ap.gov.in వెబ్‌సైట్ లేదా క్రీడా యాప్ ద్వారా తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ప్రధాన కేంద్రాలైన శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియం, టెక్కలి, పలాస, ఇచ్చాపురం, నరసన్నపేట, ఆముదాలవలస, రణస్థలం తదితర ప్రాంతాల్లో అథ్లెటిక్స్, బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్, హాకీ, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు విద్యార్థులకు మెళకువలు నేర్పిస్తారన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఏ. మహేశ్ బాబు, సెట్ శ్రీ సిఇఓ వి. వెంకట అప్పలనాయుడు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బీవీ రమణలు శిబిరాలు నిర్వహించే ప్రాంతాల జాబితాను సోమవారం తమ కార్యాలయంలో ప్రకటించారు. మరింత సమాచారం కోసం 7680075375 నంబర్‌ను లేదా Srikakulam.dsa@gmail.com ఈమెయిల్ ద్వారా, లేదా డిఎస్ఏ క్యూఆర్ కోడ్ ద్వారా సంప్రదించాలని వారు సూచించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546